



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

జిల్లాలో పారిశ్రామిక ప్రగతి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా.

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా పారిశ్రామికంగా గణనీయమైన ప్రగతి సాధిస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్ -2024 కు సంబంధించి పరిశ్రమల యాజమాన్యాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు హబ్ లో 5 వేల ఎకరాల్లో జైరాజ్ ఇస్పాత్, రిలయన్స్, అగస్త్యా, డ్రోన్స్‌హబ్ తదితర కంపెనీలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ పరిశ్రమల ద్వారా వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. పారిశ్రామిక హబ్‌కు నీటి సరఫరా పనులు కూడా 80 శాతం పూర్తయ్యాయన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వేగంగా అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. బిజినెస్ రీఫార్మ్ యాక్షన్ ప్లాన్ 2024 కు సంబంధించి 435 రికమండేషన్స్ తో కేంద్ర ప్రభుత్వ సంస్థ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఇండస్ట్రీ , ఇంటర్నల్ ట్రేడ్(డిపి ఐఐటి) వారి ద్వారా ఫీడ్‌బ్యాక్ సర్వే నిర్వహిస్తోందన్నారు. (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, విజయవాడ) ఆధ్వర్యంలో ప్రసంజిత్‌దేబ్ కన్సల్టెంట్ పరిశ్రమలు నెలకొల్పడానికి సింగిల్ డెస్క్‌పోర్టల్ ను ఏ విధంగా వినియోగించుకోవాలి, ఈజ్ ఎఫ్‌డూయింగ్ బిజినెస్ ఫీడ్‌బ్యాక్‌ను ఏ విధంగా ఇవ్వాలి అన్న విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పారిశ్రామికవేత్తలకు వివరించారు. ఇండస్ట్రీస్ జవహర్ బాబు, డిప్యూటీ డైరెక్టర్ హరినాథ్ రెడ్డి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, డిడి గ్రౌండ్ వాటర్ శ్రీనివాసులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, హాజరయ్యారు.

నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

ఈ ఏడాదిలో ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లను సమీక్ష నిర్వహించారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ఆధారంగానే కలెక్టర్ల కాన్ఫరెన్స్, జిల్లాస్థాయి సమీక్ష, మండల స్థాయి సమీక్షలు ఉంటాయన్నారు. ఆయా శాఖల హెడ్ ఆఫీస్ నుండి కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ను లక్ష్యాలను కేటాయించారన్నారు. డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, జిల్లా పరిషత్ సిఇఒ నాసరరెడ్డి, హౌసింగ్ పిడి చిరంజీవి, డ్వామా పిడి వెంకటరమణయ్య, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలి

జిల్లా అంతటా శనివారం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా అంతటా ర్యాలీలు, అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. హోళగుంద మండలంలోని మద్దిలింగడహళ్లి గ్రామంలో చెత్త సేకరణ సక్రమంగా లేదని ఫిర్యాదులు చేశారన్నారు. గ్రామంలో పారిశుధ్యానికి సంబంధించి తగిన చర్యలు తీసుకున్నారా అని ఎంపిడిఒను ప్రశ్నించారు. గ్రామానికి వెళ్ళి పరిశీలించి తగిన చర్యలు తీసుకున్నామని ఎంపిడిఒ కలెక్టర్‌కు వివరించారు. దేవనకొండ మండలం కరివేముల, పాలకుర్తి, ఆదోని మండలం కడితోట, ఆస్పరి మండలం ఆస్పరి, కైరుప్పల, కౌతాళం మండలం నడిచాగి, పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ, వెల్దుర్తి మండలం అల్లుగుండు, కోసిగి మండలం వండగల్ గ్రామాల్లో చెత్త సేకరణ జరగడం లేదని ప్రజలు ఫిర్యాదులు చేశారన్నారు. ఈ గ్రామాల్లో ప్రతి రోజు చెత్త సేకరణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత మండల ఎంపిడిఒలను ఆదేశించారు.

ఉచిత 'బస్సు' భద్రమేనా..?

- కండిషన్‌లో లేని బస్సులు - వరుస ఘటనలతో ప్రయాణికుల బెంబేలు - కొత్త బస్సుల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణానికి కేటాయించిన బస్సుల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కండిషన్‌లో లేని బస్సుల వల్ల జిల్లాలో ఇటీవల చేసుకున్న వరుస ఘటనలతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. కొత్త బస్సులు తీసుకురాకుండా ప్రస్తుతం ఉన్న బస్సులనే వినియోగిస్తుండటంతో పెరిగిన రద్దీకి అవి సరిపోకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతాయి.

స్త్రీ శక్తి పథకం పేరుతో కూటమి ప్రభుత్వం ఈ నెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తోంది. కర్నూలు జిల్లాలో 270 బస్సులకు ఉచిత ప్రయాణం కోసం కేటాయించారు. అందులో 186 పల్లెవెలుగు బస్సులు, 2 అల్ట్రా పల్లె వెలుగు బస్సులు, 82 ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. అలాగే నంద్యాల జిల్లాలో 378 బస్సులకు ఉచిత ప్రయాణానికి కేటాయించారు. అందులో 321 పల్లె వెలుగు, 5 అల్ట్రా పల్లె వెలుగు, 52 ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. ఆ బస్సుల్లో కండిషన్‌లో లేని బస్సులు దాదాపు 30 శాతం వరకూ ఉన్నట్లు తెలుస్తోంది. ఆ బస్సులు ఒక్కో సారి ఎక్కడ పడితే అక్కడ మొరాయిస్తున్నాయి. మరికొన్ని అధిక ప్రయాణికుల వల్ల ముందుకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాయి. ప్రభుత్వం కొత్త బస్సులను కొనుగోలు చేస్తామని చెప్పినా ఇప్పటి వరకూ కొత్త బస్సులను తీసుకురాలేదు. దాంతో ప్రస్తుతం ఉన్న బస్సులనే ఉచిత ప్రయాణానికి వినియోగిస్తున్నారు. అవి ప్రయాణికుల రద్దీకి సరిపోవడం లేదు. ప్రగతి రథచక్రాలు, ఆర్‌టిసి ప్రయాణం సురక్షితం అని బస్సులపై రాసి ఉంటుంది. అయితే ఇలా బస్సు టైర్లు ఊడిపోవడం, బస్సులు ఎక్కడ పడితే అక్కడ ఆగిపోవడం, బస్సుల్లో మంటలు చెలరేగడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలంటే ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. ప్రభుత్వం వెంటనే కొత్త బస్సులను తీసుకురావాలని కోరుతున్నారు.

కానరాని బాడీవార్న్ కెమెరాలు

మహిళల భద్రత కోసం కండక్టర్లకు బాడీవార్న్ కెమెరాలు ఏర్పాటు చేస్తామని స్త్రీ శక్తి పథకం విధివిధానాల ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ఉచిత బస్సు పథకం ప్రారంభమై వారం రోజులు గడిచినా ఇప్పటి వరకూ బాడీవార్న్ కెమెరాలను అందించలేదు.

• "ఆదోని డిపో చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం ఉదయం ఆదోని నుంచి కర్నూలుకు బయల్దేరింది. గోనెగండ్ల గ్రామంలోని ఎస్సీ కాలనీ చివరకు చేరుకోగానే బస్సులో ఉన్నట్లుండి భారీ ఎత్తున పొగలు లేసి మంటలు చెలరేగాయి. గుర్తించి అప్రమత్తమైన బస్సు డ్రైవర్ బస్సును పక్కన నిలిపిన బస్సులో ఉన్న సుమారు 50 మందిని కిందికి దింపి వేయడంతో ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. విషయాన్ని గుర్తించిన స్థానికులు, యువకులు అప్రమత్తమై బిందెలు, బకెట్లలో నీటిని తెచ్చి మంటలను అదుపు చేశారు."





• "ఆత్మకూరు ఆర్టీసీ డిపోకు చెందిన ఎపి39యుజె 2407 నంబర్ గల బస్సు కర్నూలు నుండి ఆత్మకూరుకు వస్తుండగా ఆత్మకూరు పట్టణంలోని ఇందిరానగర్ చెర్వు వద్ద బస్సు టైర్ ఊడిపోయింది. ఒక్కసారిగా బస్సులో ఉన్న 40 మంది ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. బస్సు ముందు టైరు ఊడిపోవడంతో బస్సు కుంగిపోయింది. అయితే ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు."



15 ఏళ్లు దాటిన బస్సులు లేవు

జిల్లాలోని ఆర్‌టిసి బస్సులు 15 ఏళ్లు దాటిన బస్సులు ఏవీ లేవు. అన్నీ కండిషన్‌లో ఉన్న బస్సులనే నడుపుతున్నాం. మొన్న కాలిన బస్సు ఫైర్ వల్ల. ఘటన జరిగిన వెంటనే డ్రైవర్ అప్రమత్తమై ఆర్పేశారు.

- టి.శ్రీనివాసులు, ఆర్‌టిసి ఆర్ఎం.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వికలాంగుల పింఛన్లను పునరుద్ధరించాలి

25న కలెక్టరేట్ ధర్నాలో పాల్గొనాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాలలో నివసించే అర్హులైన వికలాంగుల పింఛన్లను తొలగించడం న్యాయమేనా అని సిపిఎం సీనియర్ నాయకులు డి పార్వతయ్య, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌ఎండి షరీఫ్ లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం కర్నూల్ నగరపాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడుకు సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఐదేళ్లలో గత ప్రభుత్వం వైసిపి నుండి నేటి కూటమి ప్రభుత్వం దాదాపు 16 నెలల పాటు వికలాంగుల పింఛన్లను ఏ రకంగా కోత పెడతారని అన్నారు. ప్రభుత్వానికి ఇవ్వడానికి చేతకాక పింఛన్లు రద్దు చేశారని విమర్శించారు. వారందరూ కూడా అర్హులైన వారు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఏ కారణంగా లేకుండా తొలగించడం చాలా బాధాకరమన్నారు. తక్షణమే పింఛన్లను పునరుద్దరించాలని, లేకపోతే వికాలాంగులతో పాటు ఇతర ప్రజానీకాన్ని సమీకరించి పెద్ద ఎత్తున కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. పింఛను కోల్పోయిన వికాలాంగులందరూ ఐక్యమై ఈనెల 25న సోమవారం కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాలో పాల్గొనాలని కోరారు. జావిద్‌బాష, శుక్లాజీ రావు. జగదీష్ ఛాయబాయి , నర్సుబాయి, రాములమ్మ, నాగమద్దమ్మ, మింజు బాష, అఫ్రోజ్ బాష తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలు పెరిగేనా..?

-ఆసక్తి చూపని విద్యార్థులు
-గతేడాది 30శాతం సీట్లే భర్తీ
-కళాశాలలో నామమాత్రపు వసతులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంటర్ చదివిన తర్వాత విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇంటర్లో ఎంపిసి కోర్సు చేసిన విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో బిటెక్ కోర్సుల వైపు వెళ్తున్నారు. బైపిసిలో కొంత మెరిట్ కలిగిన విద్యార్థులు ఎంబిబిఎస్ లేదా బిడిఎస్ వెటర్నరీ అగ్రికల్చర్ కోర్సులని అభ్యసించేందుకు మొగ్గుచూపుతున్న పరిస్థితి నెలకొంది. డిగ్రీ కోర్సులను అభ్యసించేందుకు మాత్రం విద్యార్థులు ముందుకు రావడం లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 71 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. అందులో దాదాపుగా 32వేల సీట్లు ఉన్నాయి. క్లస్టర్ వర్సిటీ పరిధిలో మూడు కళాశాలలో ఉండగా అందులో దాదాపుగా 2400 డిగ్రీ అడ్మిషన్లు ఉన్నాయి. ఇందులో రాయలసీమ వర్సిటీ పరిధిలో గత విద్యా సంవత్సరం 10600 మంది విద్యార్థులు మాత్రమే డిగ్రీ కోర్సులలో చేరారు. క్లస్టర్ వర్సిటీ పరిధిలోని కళాశాలలో కూడా 50 శాతం డిగ్రీ అడ్మిషన్లు జరిగాయి. మళ్లీ ఇప్పుడు డిగ్రీ అడ్మిషన్లను బుధవారం నుండి ప్రారంభించారు. విద్యార్థులు ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కళాశాలలో కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు 24 నుండి 8 వరకు వెబ్ ఆప్షన్లను కల్పించారు. 29న సీట్లను విద్యార్థులకు కేటాయింపు 31న విద్యార్థులకు అడ్మిషన్ ప్రవేశపత్రాలను అందజేస్తారు. సెప్టెంబర్ 1 నుండి విద్యార్థులకు తరగతులను ప్రారంభించేలా కళాశాల విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.



డిగ్రీ కోర్సుల పట్ల చిన్న చూపు : డిగ్రీ కోర్సులు చేసిన తర్వాత విద్యార్థులు ఉపాధి అవకాశాలు పూర్తిగా లేని పరిస్థితి నెలకొంది. డిగ్రీ పూర్తి చేసిన అనంతరం పీజీ ఇతర కోర్సులు చేసిన త్వరగా ఉపాధి అవకాశాలు పొందుతారనేది గమనార్హం. అందుకే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను బిటెక్ మెడికల్ ఆధారిత కోర్సులు డిప్లమా కోర్సుల వైపు చేర్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కోర్సులు చేరిన వెంటనే విద్యార్థులకు త్వరగా ఉపాధి అవకాశాలు పొందుతున్నారు.

కనిపించని స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాల జాడ : వైసిపి ప్రభుత్వం ప్రతి యూనివర్సిటీ , డిగ్రీ కళాశాలల పరిధిలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను నెలకొల్పారు. ఈ కేంద్రాల్లో విద్యార్థులకు వృత్తి నైపుణ్య కోర్సులకు సంబంధించి శిక్షణ ఇచ్చేవారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పలు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఎక్కడ పనిచేయడం లేదు. ఈ కేంద్రాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నటువంటి దాఖలాలు లేవు.

పేరుకు మాత్రమే డిగ్రీ కళాశాలలు : ప్రైవేటు డిగ్రీ కళాశాలలో పేరుకు మాత్రమే నడుస్తున్నాయి. ఈ కళాశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధన అందడం లేదు. కళాశాలలో ఒక పేరుకు మాత్రమే బోర్డులు పెట్టుకొని ఎక్కడ తర గతులను నిర్వహించడం లేదు. విద్యార్థులను కేవలం ప్రవేశాలు పొందిన అనంతరం పరీక్షల సమయంలో మాత్రమే కళాశాలలకు వస్తున్నారు. కళాశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. నామమాత్రంగానే బస్సులను కల్పించి విద్యార్థుల నుండి ఫీజులను యాజమాన్యాలు దండుకుంటున్నాయి.

పరిశోధనాత్మక బోధనకు శ్రీకారం



- వెంకట బస్వరావ్, విసి, రాయలసీమ విశ్వవిద్యాలయం

డిగ్రీ కోర్సులు విద్యార్థులకు పరిశోధనాత్మక బోధనకు ఈ విద్యా సంవత్సరం శ్రీకారం చుట్టాం. విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు గాను చర్యలు చేపట్టాం. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు ప్రణాళికను రూపొందించాం.



సి బెళగల్‌లో వినతులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ కె.సందీప్

ఆర్‌డిఒ వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- సి బెళగల్

సి బెళగల్ మండల కేంద్రంలో ఆర్‌డిఒ కె.సందీప్ రెవిన్యూ అధికార ఘనం సమక్షంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఆయా గ్రామాల నుండి చుక్కల భూముల సమస్యలు పరిష్కరించాలని, ఆన్‌లైన్ సమస్యలు ఉన్నాయని, భూమి కొలతలు సక్రమంగా చేయాలని పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని వినతులు ఇచ్చారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, రస్తా సమస్యలు ఇలా అనేకం పరిస్కారం కావడం లేదని పలువురు ఒక్కొక్కరిగా వినతులను ఇచ్చారు. ఆర్‌డిఒ నేరుగా 141 వినతులను స్వీకరించి ప్రతి సమస్యను పరిష్కరించాలని తహశీల్దార్ వెంకట లక్ష్మికి, ఎంపిడిఒ రాణెమ్మకు సూచించారు. రైతులకు యూరియా కొరత రానివ్వకుండా చూడాలని, ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు సమస్యల బాధితులకు అందుబాటులో ఉండి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

26 నుండి ఇంటింటికి రేషన్ పంపిణీ

ప్రజాశక్తి-పత్తికొండ

ప్రతినెల 26 నుండి 30 వరకు వికలాంగులకు , 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలని పత్తికొండ తహశీల్దార్ హుస్సేన్ సాహెబ్ పేర్కొన్నారు. శుక్రవారం పత్రిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పట్టణ ,గ్రామీణ ప్రాంతాలలో ఉన్న రేషన్ డీలర్లు వృద్ధులకు, వికలాంగులకు ఇంటింటికి వెళ్లి రేషన్‌ను పంపిణీ చేయాలన్నారు. 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు యధావిధిగా ప్రజలకు రేషన్ పంపిణీ చేయాలన్నారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలి

ఎంపికయిన కానిస్టేబుళ్లకు ఎస్‌సి విక్రాంత్ పాటిల్ సూచన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎపిఎస్‌పి 2వ బెటాలియన్ పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఎస్‌సిటి కానిస్టేబుళ్ళ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియకు హాజరై,ఎస్‌సిటి సివిల్, ఎపిఎస్‌పి ఉద్యోగాలకు ఎంపికైన పురుష, స్త్రీ అభ్యర్థులు ఈనెల 25న సోమవారం సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థులు, 26న మంగళ వారం ఎపిఎస్‌పి కానిస్టేబుల్ అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. కర్నూలు జిల్లా పోలీసు(కొండారెడ్డి బురుజు దగ్గర) కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సెలక్షన్ ప్రక్రియలో అప్పుడు అప్లికేషన్‌తో జతపర్చిన అన్ని ధృవ పత్రాల ఒరిజినల్ సర్టిఫికేట్స్, Annexure - I (Revised Attesation Form) గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించిన 3 సెట్ల జిరాక్స్ కాపీలను, 4 పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫోటోలను తీసుకుని రావాలని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు.

అసంక్రమిక వ్యాధుల ఎన్‌సిడి 4.0 వైద్యాధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ మెడికల్ కాలేజీ లెక్చరర్ గ్యాలరీలో అసంక్రమిక వ్యాధుల ఎన్‌సిడి 4.0 క్యాన్సర్ వ్యాధి నివారణపై పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యాధికారులకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం వలన ఈ వ్యాధిబారిన పడకుండా జాగ్రత్త పడవచ్చునని అన్నారు. క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే ఈ వ్యాధిని నియంత్రించవచ్చునని అన్నారు. స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ క్యాన్సర్ ప్రారంభ దశలోనే గుర్తిస్తే దాని నుంచి బయట పడవచ్చునన్నారు. తీవ్రంగా ముదరకముందే వైద్యం తీసుకుంటే మళ్ళీ సాధారణ జీవితం గడపవచ్చునని అన్నారు. క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నవారిని కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రికి ప్రతి మంగళవారం, గురువారం ఒపి నంబర్ 222కు పంపాలని తెలిపారు. డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మానవ శరీరంలో గోళ్ళకు, వెంట్రుకలకు తప్ప మిగిలిన అన్నీ భాగాలకు క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని తెలిపారు. శరీరంలో ఉండే కణజాలం తన రూపాన్ని మార్చుకొని విస్తృతంగా పెరగడాన్ని క్యాన్సర్ అని అంటారన్నారు. శరీరంలో ఏభాగానికైనా క్యాన్సర్ రావచ్చునని అన్నారు. అనంతరం హెచ్‌ఒడిలు డాక్టర్ సుధారాణి, సింతీయ శుభప్రదక్యాన్సర్ వ్యాధిపై సూచనలు చేశారు. డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్‌శ్రీరాములు మాట్లాడారు. రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్.మహేశ్వర్ ప్రసాద్, డాక్టర్ విజయ భాస్కర్, డాక్టర్ మంజుషా, వైద్యులు వెంకట సుబ్బ నాగరాజు, సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్.రఘు, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమోచంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యా భోదకురాలు పద్మావతి, ఫ్లోరోసిస్‌కన్సల్టెంట్ సుధాకర్, ఎన్‌సిడి ఎపిడమలాజిస్ట్ వేణుగోపాల్, ఆర్‌కెఎస్‌కె కన్సల్టెంట్ మల్లికార్జున, ఫైనాన్స్ కన్సల్టెంట్ అరుణ , ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ

డయల్ యువర్ ఎస్ఇకి 18 వినతులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమానికి 18 వినతులు వచ్చాయని ఎస్ ఇ ఎం.ఉమాపతి చెప్పారు. శుక్రవారం ఎస్ఇ కార్యాలయంలో ఉదయం 10 నుండి 11 గంటల వరకు నిర్వహించిన కార్యక్రమానికి స్తంభాలకు సంబంధించిన రెండు, డిటిఆర్ సంబంధించి ఒకటి, సప్లయ్ ఫెయిల్యూర్ ఒకటి, ఓల్టేజ్ ఎక్కువ తక్కువలు రెండు, విద్యుత్ ఎక్కువ తక్కువ నాలుగు, కొత్త సర్వీసులు ఒకటి, వ్యవసాయ కనెక్షన్లు ఒకటి, ఇతరములు ఆరు మొత్తం 18 వచ్చాయని తెలిపారు.



ఫోన్‌లో సమస్యలు వింటున్న ఎస్ఇ

పోలాకల్ - ఎమ్మిగనూరు రోడ్డు కోసం ధర్నా

ప్రజాశక్తి- సి బెళగల్ : పోలకల్ నుండి ఎమ్మిగనూరు వరకు 30 కిలోమీటర్లు రోడ్డు అధ్వానంగా ఉందని తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని కంభదహాల్ వాసులు శుక్రవారం పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా నిలబడి ధర్నా చేయడంతో అటు ఇటు వాహనాలు నిలిచి రాకపోకలు ఆగిపోయాయి. ఏళ్లుగా రోడ్డు పరిస్థితి మారడం లేదని అధికారులు, నాయకులు, ఎమ్మెల్యే, ఎంపీ లు ఎవరూ కనీస స్పందన చూపకపోవడం సిగ్గుచేటని వారన్నారు. ఈ ధర్నా తో మేలుకోవాలని, లేదంటే మండల కేంద్రంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



రాస్తారోకో చేస్తున్న స్థానికులు

ఎస్‌సిల భూములపై కన్ను

-కంది పంటను తొలగించిన కబ్జాదారులు-ఆందోళన వ్యక్తం చేస్తున్న పేద దళితులు
-రైతులకు న్యాయం చేయాలి-జి రామకృష్ణ ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రూ కోట్లు విలువ చేసే ఎస్‌సిల భూములపై కబ్జాదారుల కన్ను పడింది. ఈ భూమి తమకు చెందినదని కబ్జాదారులు ఎస్‌సిలు సాగుచేసుకున్న కంది పంటను తొలగించేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ పొలిమేరలోని జాతీయ రహదారికి అనుకొని ఉన్న ఎస్‌సిల భూములపై కబ్జాదారుల కన్ను పడిందని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు. సర్వే నెంబర్ 1292 లో 7.50ఎకరాలు నిరుపేద ఎస్‌సిలు అగుటు లక్ష్మీదేవి, అగుటు శంకరమ్మ, బొల్లవరం బాలమ్మ సాగు చేసుకుంటున్నారన్నారు. 2008లో రైతులకు పాస్ పుస్తకాలను మంజూరు చేశారని, ఎస్‌సిలు సాగు చేసుకుంటుంటే భూమిని కొంతమంది రాజకీయ పెద్దల అండతో ఆక్రమించుకునేందుకు పక్కగా ప్రణాళికను రూపొందించుకున్నారన్నారు. బనగానపల్లెకు చెందిన వెంకటేశ్వర రెడ్డి ఈ భూమి తనకు పట్టా పాస్ పుస్తకం మంజూరు అయిందని, ఎస్‌సిలు సాగు చేసుకున్న కంది పంటను ఇటీవల ట్రాక్టర్లతో పంటను తొలగించారు. ఈ ఘటనను అడ్డుకుపోయిన రైతులను నిలువరించారు. ఇటీవల రెండు రోజుల క్రితం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎస్‌సిలు సాగు చేసుకున్న భూములను పరిశీలన చేశారన్నారు. తమ భూములు తమకే దక్కేలా చూడాలని విన్నవించుకున్నారు. ఎస్‌సి రైతులకు ప్రజా సంఘాల నాయకులు కూడా ఈ విషయాన్ని జిల్లా స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తప్పనిసరిగా న్యాయం చేసేందుకు పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు.

రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

నిరుపేద ఎస్‌సిలు సాగు చేసుకున్న భూములను అన్యాయంగా ఆక్రమించుకునేందుకు కొంతమంది ఆక్రమణదారులు సిద్ధమయ్యారు. ఆక్రమణదారులు ఇటీవల కాలంలో ఆ భూమిలో రైతులు సాగు చేస్తున్న పంటను కూడా తొలగించారు. ఈ భూమిని ఆక్రమించుకున్నవారిపై కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలి. రైతుల న్యాయం జరిగే వరకు పోరాడుతామని జి.రామకృష్ణ అన్నారు.



బాధిత రైతులనుద్దేశించి మాట్లాడుతున్న జి.రామకృష్ణ



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

బాలికలను క్రీడల్లో ప్రోత్సహించాలి


అస్మిత రగ్బీ లీగ్‌పోటీల బహుమతుల ప్రధానోత్సవంలో డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్


బాలికలను క్రీడల్లో ప్రోత్సహించాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. కర్నూలు నగరంలోని ఆదర్శ విద్యా మందిర్ మైదానంలో ఏర్పాటు చేసిన అస్మితరగ్బీ లీగ్‌పోటీల బహుమతుల పదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ కర్నూలు నగరంలో ఏర్పాటుచేసిన రగ్బీలీగ్ పోటీలలో బాలికలు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటడం అభినందనీయమని చెప్పారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బాలికలకు ఆత్మరక్షణ ఎంతో అవసరమని తెలిపారు. స్త్రీ శక్తిని సమర్థవంతంగా వినియోగించుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని వివరించారు. ముఖ్యంగా క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు విజయం పైనే కాకుండా క్రీడల్లో ఆత్మవిశ్వాసంతో ఆడటంపైనే దృష్టి సారించాలని వివరించారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకుని ,క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. రగ్బీలో పాల్గొన్న క్రీడాకారులు ఎంతోమంది ఉద్యోగాలు సాధించినట్లు క్రీడా సంఘాల ప్రతినిధులు తెలిపారని ,ఇది శుభ పరిణామం అని చెప్పారు. రాష్ట్ర రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు సురేంద్ర, ప్రైవేటు పిఇటిల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

'షోర మచాప్' ఈవెంట్ కొత్త హోండా బైకుల ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



శౌర్య హోండా సి-క్యాంప్ ఆధ్వర్యంలో శుక్రవారం జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ ప్రాంగణంలో 'షోర మచాప్' పేరుతో ప్రత్యేక ఈవెంట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోండా కంపెనీ కొత్త సీబీ 125 హార్నెట్ బైకును రాజ్యసభ మాజీ సభ్యుడు టిజి. వెంకటేష్, డాక్టర్ కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. షైన్ 100 డి ఎక్స్ బైకును హోండా జోనల్ హెడ్ శరత్ ఉంద్రే, ఏరియా ఇన్చార్జులు ప్రజ్వల్ గంగ్వార్, వినోద్ కుమార్ ఆవిష్కరించారు. ప్రత్యేక ఆకర్షణగా టాలీవుడ్ గాయకులు రేణుకుమార్, కృష్ణ లాస్యల లైవ్ మ్యూజికల్ కాన్సర్ట్ నిర్వహించారు. కార్పొరేటర్ కె.పద్మలత రెడ్డి, శౌర్య హోండా మేనేజింగ్ డైరెక్టర్ కె విశ్వమోహన్ రెడ్డి పాల్గొన్నారు. హోండా సిబ్బంది, సభ్యులు, జి.పుల్లరెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ , డాక్టర్ కెవి. సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈవెంటును డాక్టర్ రవిరాచపూడి , హనీసింగ్ ఆకట్టుకునేలా యాంకరింగు చేశారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

వేరుశనగ పంట గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు కోరారు. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ యార్డు కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేరుశనగ పంట గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని, మార్కెట్ యార్డులో మురుగునీటి కాలువలు నిర్మించాలని కోరారు. పైకప్పు నిర్మాణాలు చేపట్టి వేరుశనగ రైతుల పంటను కాపాడాలని తెలిపారు. గత కొన్నేళ్లుగా వేరుశనగ పంట గ్రేడింగ్ విధానం ఆదోనిలో కొనసాగడం దురదృష్టకరమని చెప్పారు. అనంతరం మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పనకు వినతిపత్రం అందజేశారు. సోమవారం నుంచి గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, తిక్కన్న, సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన్న, గోపాల్, రైతు సంఘం నాయకులు హనుమంతు రెడ్డి, మండల కార్యదర్శి వీరారెడ్డి, రైతు సంఘం నాయకులు ఉక్కీరప్ప పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- సెట్కూరు సిఇఒ డాక్టర్ వేణుగోపాల్

ప్రజాశక్తి - కోసిగి


మాట్లాడుతున్న వేణుగోపాల్

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెట్కూరు సిఇఒ డాక్టర్ కె.వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'మత్తుపదార్థాల వ్యసనం - పర్యవసానాలు' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ టి.లక్ష్మీదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యువత తెలిసీ తెలియని వయస్సులో మాదక ద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని తెలిపారు. డ్రగ్స్ వల్ల దొంగతనాలు చేయడం లేదా డ్రగ్స్ సరఫరా ముఠాల మాటలు విని డ్రగ్స్‌ను చేరవేయడం చేస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. పాఠశాలలు, కళాశాలలకు చాక్లెట్ రూపంలో మత్తుపదార్థాలు వస్తున్నాయని తెలిపారు. నార్కోటిక్స్ డ్రగ్స్ వినియోగం లేదా సరఫరా చేస్తూ దొరికితే పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. యువత ఇలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి బాగా చదువుకుని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎస్ఐ హనుమంత రెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్, సెట్కూరు పర్యవేక్షకులు శ్యాం బాబు పాల్గొన్నారు.

రైతులకు 2,641 మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని రైతులకు 2,641 మొక్కలను పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ పుల్లయ్య తెలిపారు. శుక్రవారం రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదు పంచాయతీల్లో 16 ఎకరాలకు 12 మంది రైతులకు మొక్కలను అందించామని తెలిపారు. ఉపాధి హామీ ద్వారా కొబ్బరి, పండ్ల మొక్కలు సోమలగూడూర్ 1123, పొనకలదిన్నె 1080, జగ్గాపురం 144, ఇబ్రహీంపురం కొట్టాల 252, మాచాపురం 42 పంపిణీ చేశామని చెప్పారు. డిప్యూటీ ఎంపిడిఒ సందీప్, ఏపీవో శ్రీనివాసులు, జడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ పుష్పావతి, టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు వీరేష్, జనసేన మండల అధ్యక్షులు ఎల్లప్ప, నాగలదిన్నె గౌస్, రవి గౌడ్, నదీ కైరవాడి బజారి, పేట సామేలు, రాముడు, గాలెప్ప, పొనకలదిన్నె లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

25 నుంచి పాసింగ్ విధానం ఎత్తివేత

- మార్కెట్ యార్డు కార్యదర్శి కల్పన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈనెల 25 నుంచి పాసింగ్ విధానాన్ని ఎత్తివేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఇన్‌ఛార్జీ యార్డు కార్యదర్శి కల్పన తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల్లో ఎక్కడా లేనివిధంగా ఇక్కడ మాత్రం పాసింగ్ విధానం పేరుతో రైతులు తెచ్చిన సరుకులను గ్రేడింగ్ చేస్తూ కాలయాపన చేయడం సరికాదన్నారు. తెచ్చిన సరుకులు తెచ్చినట్టు కొనుగోలు చేయడం వ్యాపారుల లక్షణమని తెలిపారు. టెండర్ పూర్తయ్యాక కూడా తూకాలు వేసుకోకుండా కాలయాపన చేయడం రైతులకు ఇబ్బంది కలిగిస్తోందన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది సీజన్ నుంచి పాసింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. సహకరించాలని కోరారు.

మేమేం పాపం చేశాం..?

- పింఛన్ల తొలగింపుపై వికలాంగుల ఆగ్రహం

ప్రజాశక్తి - ఆదోని

దశాబ్ద కాలంగా పింఛన్లు తీసుకుంటున్న వికలాంగులకు ఉన్న పలంగా కోత పెట్టడంతో బెంబేలెత్తుతున్నారు. జిల్లావ్యాప్తంగా 5,250 మంది వికలాంగులకు నిర్ధారణ చేసుకోవాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. 'మేమేం పాపం చేశామ'ంటూ ఉసురుమంటూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు...

కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సామాజిక పింఛన్లను రూ.4 వేలకు, వికలాంగుల పింఛన్లు రూ.6 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో సుపరిపాలనకు తొలి అడుగు అంటూ నాయకులు నమ్మబలికారు. నేడు కోతలు, కోసరుతో అర్హులను అనర్హులుగా ప్రభుత్వం నిర్ధారించి వారికి నోటీసులు జారీ చేసింది. ఒక్కసారిగా వికలాంగులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ 'సారు నాకు చెయ్యి లేదు.. నాకు వినపడదు, నాకు కాళ్లు లేవు, నాకు కళ్లు లేవు. అవయవ సమస్యలు ఉన్నాయి' అంటూ ఏడుస్తూ వేడుకుంటున్నారు. అధికారులు సైతం నిజంగా వికలాంగులైన వారిని చూసి, వారి బాధలు వింటూ ఓదార్చలేక ఎక్కడ పొరబాటు జరిగిందా అనుకుంటూ వాళ్లకి సర్ది చెబుతున్నారు. ప్రభుత్వం వికలాంగుల పింఛన్ల విషయంలో నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని వికలాంగులు సైతం నిరసనలు చేస్తున్నా రు. వారికి మద్దతుగా వామపక్ష, విపక్ష నాయకులు నిలుస్తున్నారు. వికలాంగులందరికీ పింఛను మంజూరు చేయాలని సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు సిపిఎం నాయకులు ఆందోళన చేపట్టారు. పట్టణంలోనే 488 మందికి నోటీసులు ఇచ్చారు. వారందరికీ వచ్చేనెల పింఛను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి న్యాయం చేయాలని వికలాంగులు కోరుతున్నారు .


కార్యాలయం ముందు నిరసన చేపడుతున్న వికలాంగులు (ఫైల్)

వివరాలు నమోదు చేసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ



పట్టణంలోని వివిధ వార్డుల్లో నివాసముంటున్న 488 మంది పింఛనుదారులకు నోటీసులు ఇచ్చాం. గత మూడు నెలల క్రితం ఆస్పత్రిలో రీ వెరిఫికేషన్ ప్రకారం ప్రస్తుతం 40 శాతానికి తక్కువగా డిసబులిటీ నమోదు చేశారు. వారికి నోటీసులు వచ్చాయి. ప్రస్తుతం వీరి వద్ద నుంచి అభ్యర్థనలు, గతంలో ఇచ్చిన డిసబులిటీ సర్టిఫికెట్లను తీసుకుని సంబంధిత సచివాలయాల్లో మళ్లీ నమోదు చేసుకోడానికి ప్రభుత్వం వెసలుబాటు కల్పించింది. అసలైన వికలాంగులకు పింఛను మంజూరవుతుంది. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. సంబంధిత ధ్రువపత్రాలతో సచివాలయాల్లో సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలి.

ఇబ్బందులకు గురి చేయొద్దు

- లక్ష్మణ్, సిపిఎం పట్టణ కార్యదర్శి, ఆదోని



వికలాంగుల వివరాల నమోదుకు సచివాలయాల్లో ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయాలి. పని ఒత్తిడి ఉందని కొందరు సచివాలయ ఉద్యోగులు వివరాల నమోదుకు సహకరించడం లేదని వికలాంగులు చెబుతున్నారు. వికలాంగుల పింఛను కోత విధించకుండా క్రమబద్ధీకరించాలి. వారికి మద్దతుగా సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తున్నాం. అధికారుల నిర్లక్ష్యం చేస్తే ప్రతిఘటిస్తాం.

ఆత్మహత్యే శరణ్యం..!

- పింఛన్ల తీసివేతపై వికలాంగుల ఆవేదన

- ఉన్నతాధికారులు కళ్లతో చూస్తే అర్థమవుతుంది

ప్రజాశక్తి - చిప్పగిరి


ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న వికలాంగులు

తమకు ఆత్మహత్యే శరణ్యమంటూ వికలాంగులు వాపోతున్నారు. పింఛన్ల తీసివేతను నిరసిస్తూ కూటమి ప్రభుత్వంపై.. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఆక్రోశం వెల్లగక్కుతున్నారు. 'రూ.200 పింఛను తీసుకుంటున్నప్పటి నుంచి ఇప్పటివరకు కూడా ఏ ప్రభుత్వం వచ్చినా మా పింఛను తీసేయలేదు. ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వం మా పింఛన్లను తీసి వేయడం చాలా బాధ కలిగిస్తోంద'ని వికలాంగులు వాపోతున్నారు. చేసేదేమీ లేక మండల కార్యాలయం దగ్గరకొచ్చి రక్షణ మండలి వికలాంగుల సమైక్య ఆధ్వర్యంలో ఎంపిడిఒ అల్లాబకాష్‌ను కలిసి తమ గోడును చెప్పుకున్నారు. తమ పింఛన్లను తిరిగి ఇప్పించాలని శుక్రవారం ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. అర్హత ఉండి కూడా పింఛన్లు కోల్పోతున్నామని, అదే బాధగా ఉందని తమ మనోవేదనను విన్నవించారు. వికలాంగుల కడుపు కొట్టొద్దని కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పింఛన్లను తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. చిప్పగిరిలో కావేరి కొడుకు లోకేష్‌కు మనుషులపైనే ధ్యాస లేదు. ఆ పిల్లవాడి తండ్రికి 100 శాతం చెవుడు ఉంది. అలాంటి వారి పింఛన్లు ఎలా తీసేస్తారని ఆమె తమ మనోవేదనను వెల్లగక్కారు.

మా పింఛన్లు తొలగించొద్దు

- గోవిందప్ప, వికలాంగుడు, నగరడోన గ్రామం



సిఎం సార్ దయ చేసి మా వికలాంగుల పింఛన్ల తీసేయవద్దు. మీ కాళ్లు పట్టుకుంటాం. మాకు అర్హత లేకపోతే ఇవ్వొద్దండి. అధికారులే మా దగ్గరకొచ్చి చూసి మాకు అర్హత లేకపోతే తీసేయవచ్చు.



నా భర్తకు చెవుడు, కొడుకు అవిటివాడు : కావేరి, చిప్పగిరి

నా భర్త చెవిటివాడు. నా కొడుక్కు మనుషులపై ధ్యాస లేదు. అలాంటి వారిని పింఛన్‌కు అర్హత లేదని తీసివేయడం చాలా బాధగా ఉంది. మేము ఆ పింఛన్లతోనే బతుకుతున్నాం. దయచేసి వికలాంగుల పింఛన్లను తీసేయవద్దు.

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం : ఎంపిడిఒ అల్లా బకాష్

మీ సర్టిఫికెట్లలో ఉన్న శాతాన్ని చూస్తాం. మీ అందరి సమాచారం అంతా ఉన్నతాధికారులకు తెలియజేసి తిరిగి పింఛన్లను పొందేందుకు కృషి చేస్తాం. పింఛన్లపై నోటీసు వచ్చిన వారందరూ మీకు అందుబాటులో ఉన్న సచివాలయ వెల్ఫేర్ అధికారులను కలిసి ఈకేవైసీ చేయించుకొని ఆ నోటీసుకు పాత సదరం సర్టిఫికెట్లను జతపరిచి ఎంపిడిఒ కార్యాలయంలో అప్పీల్ చేసుకోవాలి. తిరిగి సదరం స్పాట్లను ఎప్పుడు నిర్వహిస్తారో వారు తేదీ ప్రకారం మీకు తెలియజేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. పింఛన్‌ను పునరుద్ధరించుకునే అవకాశం ఉంటుంది.

వికలాంగులకు ద్రోహం చేస్తున్న 'కూటమి'

ప్రజాశక్తి - కౌతాళం


రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు, వికలాంగులు

పింఛన్లను రద్దు చేసి కూటమి ప్రభుత్వం వికలాంగులకు ద్రోహం చేస్తోందని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న, వైసిపి వికలాంగుల విభాగం మంత్రాలయం అధ్యక్షులు షేక్షావలీ, మండల అధ్యక్షులు ఈరన్న మండిపడ్డారు. శుక్రవారం అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేసి, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నడవలేని కుంటివాళ్లు, చూపు కోల్పోయిన వారు, మూగ, చెవిటిలాంటి వారి పింఛన్లు తొలగించడం దారుణమన్నారు. గతంలో సదరం క్యాంపు ద్వారా అంగవైకల్యం సర్టిఫికెట్ పొందారని, రద్దు చేసిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పింఛన్లపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డుపై పడతాయన్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వమే ఇలాంటి చర్యకు పాల్పడితే ఎలా అంటూ ప్రశ్నించారు. న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. మండలంలోని 129 మంది వికలాంగులతో పాటు నాయకులు పాల్గొన్నారు.

సొమ్మసిల్లిన సిపిఎం నాయకుడు



వికలాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని, వారికి న్యాయం చేయాలని కోరుతూ ఆందోళన చేస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య సొమ్మసిల్లి పోయారు. అక్కడే ఉన్న పోలీసుల సహకారంతో ఆస్పత్రికి తరలించారు. బీపీ తక్కువ కావడంతో కళ్లు తిరిగి పడినట్లు వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం కోలుకున్నారు.


వికలాంగుల ధర్నాలో మాట్లాడుతున్న బి.విరుపాక్షి

వికలాంగుల ఉసురు పోసుకుంటున్న 'కూటమి'

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి- ఆలూరు

నూతన పింఛన్లు ఇవ్వకుండా.. ఉన్న పింఛన్లను తొలగిస్తూ కూటమి ప్రభుత్వం వికలాంగుల ఉసురు పోసుకుంటోందని ఎమ్మెల్యే బి.విరుపాక్షి విమర్శించారు. జిల్లాలో 5,250 పింఛన్లను తొలగించినట్లు తెలిపారు. శుక్రవారం ఆలూరు అంబేద్కర్ సర్కిల్‌లో వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే విరుపాక్షి మద్దతుగా పాల్గొని మాట్లాడారు. 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకు పింఛను ఇస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో హామీఇచ్చారని, ఇప్పటివరకు కొత్త పింఛన్లు ఇవ్వకుండా ఉన్న పింఛన్లు తొలగిస్తున్నారని విమర్శించారు. ఎక్కడ రూ.6 వేలు ఇవ్వాల్సి వస్తుందోనని అర్హులైన వికలాంగుల పింఛన్లు తొలగిస్తున్నారని మండిపడ్డారు. వికలాంగులకు పింఛన్లు ఇవ్వాలని, లేకపోతే వికలాంగులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మహిళా డైరీ సహకార సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి - ఆస్పరి

గ్రామంలో మహిళా డైరీ సహకార సంఘం ఏర్పాటు చేసినట్లు జిల్లా డైరీ సహాయ సంచాలకులు డాక్టర్ భవాని శంకర్ రెడ్డి, పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక పశు వైద్యశాలలో మహిళా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆవు, గేదెలకు మేత, దాణా, సంరక్షణ వల్ల పాలు ఉత్పత్తి చెంది ఎక్కువ పాలు ఇస్తాయని తెలిపారు. పశువుల పెంపకానికి బ్యాంకు ద్వారా రాయితీ రుణాలు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. పాలు పోసే రైతులు సంఘంగా ఏర్పడడం వల్ల కలిగే లాభాలు, పాల ఉత్పత్తి పెరుగుదల, పాల నాణ్యత, పాలలో కొవ్వు శాతం పెరగడం వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. కర్నూలు డైరీ పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, విజయ డైరీ డాక్టర్ రమేష్, విజయ డైరీ మేనేజర్ శ్రీనివాస చారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ సంతోష్ కుమార్, డాక్టర్ సావిత్రి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

బడికి వెళ్లాలంటే..

బురదలో నడవాల్సిందే..!

ప్రజాశక్తి - కౌతాళం

విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలకు తల స్నానాలు చేయించి, మంచి దుస్తులు వేసి పాఠశాలలకు పంపిస్తున్నారు. మండలంలోని లింగాలదిన్నె గ్రామంలో విద్యార్థుల పరిస్థితి వేరుగా ఉంది. పాఠశాలకు వెళ్లే పిల్లలు బురదమయంగా మారుతున్నారు. ఎంతో ఉత్సాహంతో వస్తున్న విద్యార్థులు దుర్గంధంతో కూడిన బురదలో నడిచి పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.


బురదలో నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

మండలంలోని లింగాలదిన్నె గ్రామంలోని పాఠశాలలకు రోజూ 100 మందికి పైగా విద్యార్థులు చదువుకోడానికి వెళ్తుంటారు. విద్యార్థులతో పాటు రైతులు, మహిళా కూలీలు కూడా అదే దారిలో పొలాలకు వెళ్లాల్సి ఉంది. భారీగా వర్షాలు రావడంతో రోడ్డు గుంతలు ఏర్పడి బురదమయం కావడంతో నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. వృద్ధుల పరిస్థితి దారుణంగా ఉంది. అధికారులు స్పందించి రోడ్డు బాగు చేసి విద్యార్థులకు, గ్రామస్తులకు ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

విద్యార్థుల సమస్యను పరిష్కరించాలి

- గ్రామస్తుడు నాగరాజు



లింగాలదిన్నె గ్రామంలో పాఠశాలకు విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి. పాఠశాలకు వెళ్లాలంటే బురదలో నడిచి కింద పడి దెబ్బలు తగిలించుకున్న సందర్భాలు ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డును వెంటనే బాగు చేయాలి.

శిథిలావస్థలో పశువైద్యశాల

- ప్రాణ భయంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న వైద్యులు - స్పందించని అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - నందవరం

నాగలదిన్నె గ్రామంలో గల పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. వైద్యులు భయపడుతూ ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరినా అధికారులు, నాయకులు స్పందించడం లేదు.


శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల

మండలంలోని నాగలదిన్నె గ్రామం తుంగభద్ర నదీతీరంలో నిర్మించిన పశువైద్యశాల ప్రమాదకరంగా మారింది. నాగలదిన్నె, మిట్టాసోమాపురం, గురజాల, చిన్నకొత్తిలి, పెద్దకొత్తిలి గ్రామాల నుంచి ప్రజలు పశువులను తీసుకొచ్చి ఇక్కడ వైద్య సేవలను పొందుతున్నారు. 26 ఏళ్ల క్రితం మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి వైద్యశాలను నిర్మించినట్లు గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు. అప్పటి నుంచి దాని గురించి పట్టించుకునే నాథులే లేరు. అది పూర్తిగా ప్రమాదస్థాయికి చేరుకుంది. పైకప్పు మొత్తం పెచ్చులూడి కడ్డీలు తేలాయి. మిద్దె ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది భయపడిపోతున్నారు వర్షపు నీరు మిద్దెపైనే నిలిచి ఉన్నాయి. నీరు ఎటు వెళ్లలేక స్విమ్మింగ్ పూల్‌ను తలపించే విధంగా ఉంది. పైన నీరు నిలవడం వల్ల ఆస్పత్రి మొత్తం నీరు కారుతోంది. కనీసం వైద్యులు కూర్చోవడానికి కూడా వీలు లేని విధంగా నీరు పడుతున్నాయి. వైద్య పరికరాలు, ఔషధాలు నీటితో తడిసి దుర్వాసన వెదజల్లుతున్నాయి. కనీసం విద్యుత్ సదుపాయం కూడా లేదు. లైట్లు, ఫ్యాన్లు లేక చాలా అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొంతమంది వ్యక్తులు వైద్యశాల చుట్టుపక్కల బహిర్భూమికి వెళ్తున్నారు. వైద్యశాల చుట్టూ ముళ్లపొదలు కమ్ముకున్నాయి. తుంగభద్ర నదీతీరంలో ఉండడంతో నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తూ మరింత భయాన్ని కలిగిస్తోంది.

నూతన వైద్యశాలను ఏర్పాటు చేయాలి

- సి.హారతి, పశువైద్యాధికారి, నాగలదిన్నె



ప్రమాదకరంగా ఉన్న పశువైద్యశాలలో విధులు నిర్వహించడానికి ఇబ్బందికరంగా ఉంది. ప్రాణ భయంతో విధులు నిర్వహిస్తున్నాం. నది ఉధృతంగా ప్రవహించడంతో తీరానికి ఎవరూ వెళ్లకూడదని అధికారులు గ్రామస్తులకు హెచ్చరికలు జారీ చేశారు. 500 మీటర్ల దూరం ఉన్న ప్రజలపై బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారు. తుంగభద్ర నదికి 10 మీటర్ల దూరంలో వైద్యశాల ఉంది. మా ప్రాణాల గురించి అధికారులకు పట్టడం లేదు. ప్రమాదకరంగా తుంగభద్ర ప్రవహించినా, మాపై వైద్యశాల పడిపోయే విధంగా ఉన్నా అధికారులు, నాయకులు మాపై శ్రద్ధ చూపకపోవడం బాధాకరం. ప్రభుత్వం స్పందించి వేరే ప్రదేశంలో నూతన వైద్యశాలను నిర్మించాలి.


తడిసిన మెడిసిన్ చూపిస్తున్న అటెండర్ కమలమ్మ

సమస్యను పరిష్కరించాలని నివేదిక పంపాం

- నరేంద్రనాథ్ రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, నందవరం మండలం



సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి, నాయకులకు చాలా సందర్భాల్లో తెలియజేశాం. ఇప్పటివరకు ఎవరూ స్పందించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వానికి కూడా నివేదికలు పంపాం.

ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఆదోని


అన్నం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సినీ హీరో మెగా స్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకలను ఆదోనిలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జనసేన నాయకులు, అభిమానులు భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రైల్వే స్టేషన్ ఫుట్‌పాత్‌లపై ఉంటున్న అభాగ్యులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు పులి రాజు, చిరుత రాజశేఖర్, ప్రకాష్ మాట్లాడారు. అంచెలంచెలుగా ఎదిగి సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్న ఘనత చిరంజీవికి దక్కిందన్నారు. ఆయన అడుగుజాడల్లోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

క్రీడల్లోనూ రాణించాలి

- విజయ విఠల ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్లు యూసుఫ్, చంద్రమోహన్

ప్రజాశక్తి - చిప్పగిరి

విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని విజయ విఠల ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్లు యూసుఫ్, చంద్రమోహన్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. కర్నూలు బి క్యాంపు బాలుర ప్రాథమిక ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి చిప్పగిరి విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 30, 31న డోన్ పట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను మండలంలోని విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని సాతనూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో విద్యార్థులకు రూ.25 వేల నగదు పంపిణీ చేశారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ట్రెజరరీ మేనేజర్ సాయితేజ, సేల్స్ ఆఫీసర్ బి.రఘు, కంపెనీ ఫీల్డ్ అడ్వయిజర్ వి.రవి, ఎమ్.రవి, ఉస్సేనిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న పది మంది ప్రతిభావంతులకు రూ.2,500 చొప్పున నగదు, సర్టిఫికెట్లను పంపిణీ చేశామన్నారు. ప్రతేడాది జిల్లాలో నాలుగు పాఠశాలను ఎంపిక చేసుకొని విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తామని తెలిపారు. భీమా ట్రేడర్స్ తుంగభద్ర ప్రొప్రయిటర్ పిఎల్‌జి.కృష్ణా రెడ్డి సూచనలతో పంపిణీ చేశామన్నారు. ఉపాధ్యాయులు కేశవులు, రాజశేఖర్, లక్ష్మన్న, రాఘవేంద్ర, వాసు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయు గౌరవాధ్యక్షులుగా తిక్కారెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ఎన్‌ఎంయు (నేషనల్ మజ్దూర్ యూనియన్) గౌరవాధ్యక్షులుగా టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డిని ఎన్‌ఎంయు ఎమ్మిగనూరు ఆర్‌టిసి డిపో నాయకులు ఎన్నుకున్నారు. శుక్రవారం యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రఫిక్, ముస్తాక్ అహ్మద్‌లు తిక్కా రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మిగనూరు డిపోలోని సమస్యలను వివరించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఆర్‌టిసిలో ఉచిత బస్సు పథకం ద్వారా మహిళలు ఎమ్మిగనూరు డిపోలో ఉన్న బస్సులను కూడా సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు.

పరీక్షలు ఏవైనా..

ఉత్తమ ఫలితాలు రావూస్ సొంతం..!

- సిఇఒ తిరుమల రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు టౌన్ టాపర్లుగా నిలిచారని, పరీక్షలు ఏవైనా ఉత్తమ ఫలితాలు తమ సొంతమని కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి, సిఒఒ సుజనా రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. గ్రూపుల వారీగా నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో బీఎస్సీ హానర్స్ ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, మ్యాథమేటిక్స్, కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ గ్రూపుల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. బిఎ ఆర్ట్స్ హానర్స్ హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ తెలుగు గ్రూపుల్లో 93 శాతం, బీకామ్ హానర్స్ గ్రూపులో 70 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ సెమిస్టర్‌లో బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్ హానర్స్ బోటనీ, జువాలజీ గ్రూపుల్లో 86 శాతం, బీకామ్ హానర్స్ గ్రూపులో 67శాతం, బిబిఎ హానర్స్ గ్రూపులో 65 శాతం, బిఎ ఆర్ట్స్ గ్రూపులైనా పొలిటికల్ సైన్స్, హిస్టరీలో 62 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి, సిఒఒ సుజనారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్, అకాడమిక్ డీన్ వీరేష్, ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జీ విజయ్ కుమార్, నోడల్ ఆఫీసర్ శ్రుతి ప్రియా, సీనియర్ అధ్యాపకులు వెంకటేశ్వర్లు, గోరంట్ల, పాల్ రాజ్, నరసింహులు, నందిని, విజయరాజ్, సంపత్, పి.కిరణ్, సంధ్య, సురేఖ, జ్యోతి, ధనుంజయ, గోవిందు అభినందించారు.


అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో డిగ్రీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు